रजिस्टी सं डी--२२१
Registered No. D-221
రిజిస్ట్రీ సంఖ్య డి--221

[PRICE : Rs: 5.00 Paise
మూల్యము: రూ. 5.00 పైసలు

# भारत का राजपत्र
# The Gazette of India
# భారత రాజపత్రము

असाधारण
**EXTRAORDINARY**
అసాధారణ

भाग XVI अनुभाग 1
**Part XVI Section 1**
భాగము XVI అనుభాగము 1

प्राधिकार से प्रकाशित
**PUBLISHED BY AUTHORITY**
ప్రాధికారము ద్వారా ప్రచురించబడినది

| | | | | |
|---|---|---|---|---|
| सं ३ | नई दिल्ली | सोमवार | ९ अगस्त, १९९३ / १८ श्रावण, १९१५ शक | खंड ८ |
| No. 3 | New Delhi | Monday | 9th August, 1993 / 18th Sravanam, 1915 Saka | Vol. 8 |
| సంఖ్య 3 | న్యూఢిల్లీ | సోమవారము | 9 ఆగస్టు, 1993 / 18 శ్రావణం, 1915 శక | సంపుటము 8 |

## MINISTRY OF LAW AND JUSTICE

## LEGISLATIVE DEPARTMENT

New Delhi, 28th July, 1993/6th Sravanam, 1915 Saka

The translations in Telugu of the following, namely :–

(1) The Cooperative Societies Act, 1912 (Act 2 of 1912); (2) The Societies Registration Act, 1860 (Act 21 of 1860); (3) The Handlooms (Reservation of Articles for Production) Act, 1985 (Act 22 of 1985); (4) The Carriers Act. 1865 (Act 3 of 1865); (5) The Explosives Act, 1884 (Act 4 of 1884) and (6) The Disturbed Areas (Special Courts) Act, 1976 (Act 77 of 1976) are hereby published under the authority of the President and shall be deemed to be the Authoritative Texts thereof in Telugu under Clause (a) of Section 2 of the Authoritative Texts ( Central Laws) Act, 1973 (Act 50 of 1973).

## శాసన మరియు న్యాయపాలన మంత్రిత్వ శాఖ

### (శాసన నిర్మాణ విభాగము)

న్యూఢిల్లీ, 22 జూలై, 1993/6 శ్రావణం, 1915 శక

ఈ క్రింది చట్టములు అనగా :--

(1) ది కోపరేటివ్ సొసైటీస్ యాక్టు, 1912 (1912 లోని 2వ చట్టము); (2) ది సొసైటీస్ రిజిస్ట్రేషన్ యాక్టు, 1860 (1860 లోని 21వ చట్టము); (3) ది హ్యాండ్‌లూమ్స్ (రిజర్వేషన్ ఆఫ్ ఆర్టికల్స్ ఫర్ ప్రొడక్షన్) యాక్టు, 1985 (1985 లోని 22వ చట్టము); (4) ది క్యారియర్స్ యాక్టు, 1865 (1865 లోని 3వ చట్టము); (5) ది ఎక్స్‌ప్లోజివ్స్ యాక్టు, 1884 (1884 లోని 4వ చట్టము) మరియు (6) ది డిస్టర్బ్‌డ్ ఏరియాస్ (స్పెషల్ కోర్ట్స్) యాక్టు, 1976 (1976 లోని 77వ చట్టము)ల యొక్క తెలుగు అనువాదములను రాష్ట్రపతి ప్రాధికారము క్రింద ఇందుమూలముగా ప్రచురించడమైనది. ఈ అనువాదములను ఆ చట్టములకు, ప్రాధికృత పాఠముల (కేంద్ర శాసనముల) చట్టము, 1973 (1973 లోని 50వ చట్టము) యొక్క 2వ పరిచ్ఛేదములోని ఖండము (ఏ) క్రింద ప్రాధికృత తెలుగు పాఠములైనట్లు భావించవలెను.

# చేనేత మగ్గముల (ఉత్పత్తి కొరకు వస్తువుల ప్రత్యేకింపు) చట్టము, 1965

(1985 లోని 22వ చట్టము)

(29 మార్చి, 1985)

కేవలం చేనేత మగ్గాల ద్వారా ఉత్పత్తి చేయుటకై కొన్ని వస్తువులను ప్రత్యేకించుట కొరకును, అందుకు సంబంధించిన విషయముల కొరకును నిబంధనలు చేయుటకైన చట్టము.

భారత గణరాజ్యము యొక్క ముప్పది ఆరవ సంవత్సరంలో పార్లమెంటుచే ఈ క్రింది విధంగా శాసనము చేయడమైనది:-

1. (1) ఈ చట్టాన్ని చేనేత మగ్గముల (ఉత్పత్తి కొరకు వస్తువుల ప్రత్యేకింపు) చట్టము, 1985 అని పేర్కొనవచ్చును. సంగ్రహనామము, విస్తరణ మరియు ప్రారంభము.

(2) ఇది యావద్భారత దేశానికి వర్తించును.

(3) ఇది కేంద్ర ప్రభుత్వము అధిసూచన ద్వారా రాజపత్రంలో నియతము చేయునట్టి తేదీన అమలులోనికి వచ్చును.

2. ఈ చట్టములో సందర్భాన్నిబట్టి అర్థము వేరుగా ఉన్ననే తప్ప- నిర్వచనములు.

(ఎ) "సలహా కమిటీ" అనగా 4వ పరిచ్ఛేదం క్రింద ఏర్పాటైన సలహా కమిటీ అని అర్థము;

(బి) "చేనేత మగ్గము" అనగా మరమగ్గము కానట్టి ఏదేని మగ్గమని అర్థము;

(సి) "తయారీదారు" అను పదపరిధిలో ఉత్పత్తిదారు మరియు ప్రక్రియకారుడు చేరియుండును; "తయారుచేయు" అను పదబంధమును తదనుసారంగా అన్వయించవలెను.

(డి) "మర మగ్గము" అనగా ఫ్యాక్టరీల చట్టము, 1948 యొక్క 2వ పరిచ్ఛేదంలోని ఖండం (జి)లో నిర్వచింపబడినట్లు విద్యుచ్ఛక్తితో నడిపించబడు మగ్గమని అర్థము; 1948 లోని 63.

(ఇ) "ప్రక్రియకారుడు" అనగా బట్టలను ఉత్పత్తి చేసిన తరువాత రంగులద్దుట, తెలుపుచేయుట, మెరుగుపెట్టుట, నునుపుచేయుట, కుట్లుకుట్టుట, ప్రింట్‌వేయుట, రయిసింగ్, బట్టలపై ఉబ్బచ్చువేయుట లేక తుదిమెరుగులు దిద్దే ఏదేని ఇతర ప్రక్రియవంటి ఏదేని ఆనుషంగికమైన పనిచేయు వ్యక్తి అని అర్థము, కాని ఈ పదపరిధిలో ఉత్పత్తిదారు చేరియుండడు, మరియు "ప్రక్రియ" అను పదమును తదనుసారంగా అన్వయించవలెను.

(ఎఫ్) "ఉత్పత్తిదారు" అనగా చేనేత మగ్గముకానట్టి ఏదేని మగ్గముపై బట్టలను ఉత్పత్తిచేయుచున్న వ్యక్తి అని అర్థము; ఈ పదపరిధిలో బట్టల ఉత్పత్తి కొరకు ఒక మగ్గాన్ని కలిగియున్న, మగ్గముపై పనిచేయుచున్న లేక మగ్గమును నడుపుచున్న వ్యక్తి చేరియుండును, మరియు "ఉత్పత్తిచేయు" అను పదమును తదనుసారంగా అన్వయించవలెను.

కేవలం చేనేత మగ్గాల ద్వారా ఉత్పత్తి చేయుటకు వస్తువులను నిర్దిష్టపరచు అధికారము. 1951 లోని 65.

3. (1) పరిశ్రమల (అభివృద్ధి మరియు క్రమబద్ధీకరణ) చట్టము, 1951లో ఏమియున్నప్పటికిని, కేంద్ర ప్రభుత్వం తమకు సలహా కమిటీ చేసిన సిఫారసులను పర్యాలోచించిన పిమ్మట, చేనేత పరిశ్రమ యొక్క సంరక్షణ మరియు అభివృద్ధి కొరకు ఏదేని వస్తువును లేక ఏదేని కోవకు చెందిన వస్తువులను కేవలం చేనేత మగ్గాలపై ఉత్పత్తి చేయుటకు ప్రత్యేకించుట అవసరమని తాను అభిప్రాయపడినచో ఉత్తరువులో నిర్దిష్టపరచునట్టి (ఇందు ఇటు పిమ్మట ప్రత్యేకించిన తేదీ అని పేర్కొనిన) తేదీన మరియు ఆ తేదీ లగాయతు అట్టి వస్తువును లేక అట్టి కోవకు చెందిన వస్తువులను కేవలం చేనేత మగ్గాలపై ఉత్పత్తి చేయుటకు ప్రత్యేకించవలెనని ఆయా సమయములందు రాజపత్రంలో ప్రచురించిన ఉత్తరువు ద్వారా ఆదేశించ వచ్చును.

(2) ఉపపరిచ్ఛేదం (1) క్రింద ప్రచురించిన ప్రతి ఉత్తరువు దానిని చేసిన పిమ్మట వీలయినంత శీఘ్రంగా, పార్లమెంటు అధివేశనంలోనున్న సమయమున, మొత్తం ముప్పది దినముల కాలావధిపాటు దాని ప్రతియొక సదనము సమక్షమున ఉంచవలెను. ఆ ముప్పది దినములు, ఒకే అధివేశనములో గాని, వరుసగా వచ్చు రెండు లేక అంతకు ఎక్కువ అధివేశనములలోగాని చేరియుండవచ్చును. పైన చెప్పిన అధివేశనమునకు లేక వరుసగావచ్చు అధివేశనములకు వెనువెంటనే వచ్చు అధివేశనము ముగియుటకు పూర్వమే ఆ ఉత్తరువులో ఏదేని మార్పు చేయుటకు ఉభయ సదనములు అంగీకరించినచో లేక ఆ ఉత్తరువును చేయరాదని ఉభయ సదనములు అంగీకరించినచో, అటు పిమ్మట, ఆ ఉత్తరువు అట్లు మార్పుచేసిన రూపంలో మాత్రమే ప్రభావము కలిగియుండును. లేక సందర్భానుసారంగా, ప్రభావరహితమై యుండును. అయినప్పటికిని, ఏదేని అట్టి మార్పుగాని, రద్దుగాని అంతకు పూర్వము ఆ ఉత్తరువు క్రింద చేసిన దేని శాసనమాన్యతకైనను భంగము కలిగించదు.

సలహా కమిటీ ఏర్పాటు.

4. (1) కేంద్ర ప్రభుత్వం కేవలం చేనేత మగ్గాల ద్వారా ఉత్పత్తి చేయుటకు ప్రతేకించదగు ఏదేని వస్తువు లేక ఏదేని కోవకు చెందిన వస్తువుల స్వభావమును నిర్ధారణచేయు దృష్టితో, ఆ ప్రభుత్వం ఉద్దేశంలో ఆ విషయంలో సలహా నొసగుటకు అవశ్యకమైన నైపుణ్యంగల వ్యక్తులతో కూడిన ఒక సలహా కమిటీని ఏర్పాటు చేయవలెను.

(2) సలహా కమిటీ ఈ క్రింది విషయాలను పర్యాలోచించిన పిమ్మట తన సిఫారసులను కేంద్ర ప్రభుత్వానికి తెలుపవలెను, అవేవనగా:-

(ఎ) ప్రజల వినియోగం కొరకు చేనేత మగ్గాల ద్వారా ఉత్పత్తి చేయబడుచున్న వస్తువు లేక వస్తువుల కోవ;

(బి) చేనేత మగ్గాల ద్వారా సాంప్రదాయకంగా ఉత్పత్తి చేయబడుచున్న వస్తువు లేక వస్తువుల కోవ;

(సి) ఖండము (ఎ) లేక ఖండము (బి)లో నిర్దేశించిన వస్తువును లేక కోవకు చెందిన వస్తువులను కేవలం చేనేత మగ్గాల ద్వారా ఉత్పత్తి చేయుట వలన ఏ మేరకు ఉపాధి అవకాశాలు కల్పించబడును;

(డి) చేనేత పరిశ్రమలో పనిచేయుచున్న వ్యక్తుల హితముల రక్షణ మరియు ఆ పరిశ్రమను నిరంతరంగా నిర్వహించవలసిన అవసరము; మరియు

(ఇ) సలహా కమిటీ సబబని తలచునట్టి ఇతర విషయాలు.

కేవలం చేనేత మగ్గాలకొరకు ప్రత్యేకించిన వస్తువుల ఉత్పత్తిపై నిషేధము.

5. ఏదేని వస్తువును లేక ఏదేని కోవకుచెందిన వస్తువులను కేవలం చేనేత మగ్గాల ద్వారా ఉత్పత్తి చేయుటకు 3వ పరిచ్ఛేదం క్రింద ఉత్తరువు చేసినయెడల అట్టి వస్తువును లేక అట్టి కోవకు చెందిన వస్తువులను ప్రత్యేకించిన తేదీన మరియు ఆ తేదీ లగాయతు చేనేత మగ్గం కానట్టి ఏ మగ్గం ద్వారా గాని ఉత్పత్తి చేయరాదు;

అయితే, ఏదేని వస్తువును లేక ఏదేని కోవకు చెందిన వస్తువులను ప్రత్యేకించిన తేదీకి అవ్యవహితపూర్వం చేనేత మగ్గం కానట్టి ఏదేని మగ్గంపై అట్టి వస్తువును లేక అట్టి కోవకు చెందిన వస్తువులను ఉత్పత్తి చేయుచుండిన ఏ వ్యక్తియైనను అట్టి ప్రత్యేకింపు తేదీనుండి మూడు మాసాలు గడచువరకు అట్టి ఉత్పత్తి చేయుటను కొనసాగించవచ్చును.

సమాచారమును లేక నమూనాను అడుగుటకు అధికారము.

6. (1) ఈ చట్టము నిమిత్తం కేంద్ర ప్రభుత్వం ఉత్తరువు ద్వారా, ఏ తయారీదారునైనను—

(ఎ) అతనిచే గాని లేదా ఎవరేని ఇతర వ్యక్తిచే గాని సాగించబడెడి ఏదేని తయారీ కార్యవ్యవహారమునకు లేక వర్తకమునకు సంబంధించి అతని వద్ద గల సమాచారమును ఉత్తరువులో ఆ ప్రభుత్వం నిర్దిష్టపరచినట్టి ప్రరూపంలో మరియు అట్టి కాలావధిలోపల దానిచే నిర్దిష్టపరచబడిన ఎవరేని అధికారికి లేదా ప్రాధికారికి అందజేయవలసినదిగా,

(బి) అతనిచేగాని లేదా ఎవరేని ఇతర వ్యక్తిచే గాని తయారుచేయబడిన ఏవేని వస్తువుల నమూనాలను ఉత్తరువులో, దానిచే నిర్దిష్టపరచునట్టి స్థలములో మరియు అట్టి కాలావధి లోపల తనిఖీకొరకు అట్టి అధికారికి లేదా ప్రాధికారికి అందజేయవలసినదిగా—

కోరవచ్చును.

(2) ఉపపరిచ్ఛేదం (1) క్రింద ఎవరేని తయారీదారుకు ఏదేని ఉత్తరువును జారీచేసినయెడల, అతడు అట్టి ఉత్తరువును పాటించవలెను.

ప్రవేశించి తనిఖీచేయు అధికారము.

7. కేంద్ర ప్రభుత్వంచే ప్రాధికారం పొందిన (ఇందు ఇటు పిమ్మట ప్రాధికృతాధికారి అని పేర్కొనిన) ఎవరేని అధికారి, ఏ తయారీదారుకైనను చెందినట్టి ఏవేని జవుళి వస్తువులు నిలువ చేయబడిన, ఉంచబడిన, లేక విక్రయమునకై పెట్టబడిన ఏ స్థలమునందైనను, ఆవరణయందైనను సబబైన అన్నివేళలందు ప్రవేశించవచ్చును, మరియు అందు ఉంచబడిన ఏవేని లెక్క పుస్తకములను, రిజిస్టర్లను, రికార్డులను లేక ఇతర దస్తావేజులను తనిఖీకొరకు పంపవలసినదిగా కోరవచ్చును; అట్టి స్థలమునందున్నట్టి ఏవేని వస్తువులను తయారుచేయుటకు, నిలువ చేయుటకు లేక విక్రయమునకై ఉంచుటకు సంబంధించి లేక ఏవేని మర మగ్గాలకు సంబంధించి ఈ చట్టపు నిబంధనలను అమలుపరచు నిమిత్తం తాను సబబని భావించు సమాచారమును అడుగవచ్చును.

సోదాచేసి అభిగ్రహించుటకు అధికారము.

8. (1) (ఎ) 3వ పరిచ్ఛేదం క్రింద చేసిన ఏదేని ఉత్తరువులో నిర్దిష్టపరచినట్టి ఏదేని వస్తువు లేక ఏదేని కోవకుచెందిన వస్తువులు అట్టి ఉత్తరువును ఉల్లంఘించి ఏదేని స్థలంలో ఉత్పత్తి చేయబడుచున్నవని; లేక

(బి) అట్టి ఉత్తరువును ఉల్లంఘించి ఉత్పత్తిచేసిన ఏదేని వస్తువు లేక ఏదేని కోవకుచెందిన వస్తువులు ఏదేని స్థలంలో దాచియుంచబడినవని, లేక

(సి) ఏదేని వస్తువు లేక ఏదేని కోవకుచెందిన వస్తువులు ఈ చట్టము క్రింద సమసహారణకు గురికాగలవని ప్రాధికృతాధికారి విశ్వసింపుటకు కారణమున్నచో అతడు అట్టి స్థలమునందు లేక ఆవరణయందు ప్రవేశించి, అట్టి వస్తువు కొరకు లేక అట్టి కోవకుచెందిన వస్తువుల కొరకు లేక అట్టి వస్తువు లేక అట్టి కోవకు చెందిన వస్తువుల ఉత్పాదన కొరకు ఉపయోగింపబడినదని తాను అభిప్రాయపడినట్టి ఏదేని మరమగ్గము కొరకు సోదా చేయవచ్చును.

(2) ఉపపరిచ్ఛేదం (1) క్రింద చేసిన ఏదేని సోదాలో, ఏదేని వస్తువు లేక ఏదేని కోవకుచెందిన వస్తువులు లేక ఏదేని మరమగ్గము కనుగొనబడి అట్టి వస్తువు లేక అట్టి కోవకుచెందిన వస్తువులు 3వ పరిచ్ఛేదం క్రింద చేసిన ఉత్తరువును ఉల్లంఘించి ఉత్పత్తిచేయబడినదని లేక చేయబడినవని లేక అట్టి మరమగ్గం ఏదేని అట్టి వస్తువును లేదా అట్టి కోవకుచెందిన వస్తువులను ఉత్పత్తి చేయుటకు ఉపయోగింపబడినదని ప్రాధికృతాధికారి విశ్వసించుటకు కారణమున్నయెడల, అతడు అట్టి వస్తువు లేదా అట్టి కోవకుచెందిన వస్తువులు ఉన్న ప్యాకేజి లేదా కవరు లేదా పాత్ర ఏదేని ఉన్నచో దానితోసహా అట్టి వస్తువును, అట్టి కోవకుచెందిన వస్తువులను లేక మరమగ్గమును అభిగ్రహించవచ్చును:

అయితే ఏదేని వస్తువును లేక మరమగ్గమును అభిగ్రహించుట ఆచరణ సాధ్యం కానియెడల, ప్రాధికృతాధికారి సందర్భానుసారంగా ఆ వస్తువు యొక్క లేదా మరమగ్గం యొక్క సొంతదారు అట్టి ప్రాధికృత అధికారి పూర్వామోదంతో తప్ప ఆ వస్తువును తొలగించరాదని, వదులుకొనరాదని లేక ఇతర విధంగా వ్యవహరించరాదని ఒక ఉత్తరువును ఆ వస్తువు యొక్క లేక మరమగ్గం యొక్క సొంతదారుకు తామీలు చేయవచ్చును.

(3) ఉపపరిచ్ఛేదం (2) క్రింద ఏదేని వస్తువును లేక మరమగ్గమును అభిగ్రహించి అట్టి అభిగ్రహణ నుండి ఆరుమాసాలలో అభియోగమేదియు తేబడని యెడల, దానిని ఎవరి స్వాధీనం నుండి అభిగ్రహించడం జరిగిందో ఆ వ్యక్తికి వాపసు చేయవలెను.

(4) ప్రాధికృతాధికారి, ఈ చట్టం క్రింద ఏదేని చర్యకు ఉపయోగపడ గలవని లేక సంబద్ధమైనవని అభిప్రాయపడునట్టి ఏవేని దస్తావేజులను లేక వస్తువులను కూడా అతడు అభిగ్రహించవచ్చును.

(5) ఉపపరిచ్ఛేదం (4) క్రింద ఎవరి అభిరక్ష నుండి ఏవేని దస్తావేజులు అభిగ్రహించడం జరిగిందో ఆ వ్యక్తికి, ప్రాధికృతాధికారి సమక్షమున ఆ దస్తావేజుల నకళ్లు తీయించుకొనుటకు లేక వాటి నుండి ఉదాహృతులను తీసుకొనుటకు హక్కు ఉండును.

(6) ఉపపరిచ్ఛేదం (4) క్రింద అభిగ్రహింపబడిన దస్తావేజులకు లేక వస్తువులకు శాసనరీత్యా హక్కుగల ఎవరేని వ్యక్తి ఆ దస్తావేజులను లేక వస్తువులను ప్రాధికృతాధికారి నిలిపి ఉంచుకొనుటకు ఏ కారణం వలననైనను ఆక్షేపణ తెలుపుచో, అతడు అట్టి ఆక్షేపణకు కారణాలను తెలుపుచు మరియు ఆ దస్తావేజులను లేక వస్తువులను తిరిగి ఇచ్చివేయవలసినదిగా కోరుచు కేంద్ర ప్రభుత్వానికి దరఖాస్తు పెట్టుకొనవచ్చును.

(7) ఉపపరిచ్ఛేదం (6) క్రింద దరఖాస్తు అందినమీదట, కేంద్ర ప్రభుత్వం ఆకర్ణించబడుటకు దరఖాస్తుదారుకు అవకాశమునిచ్చి తాము సబబని తలచునట్టి ఉత్తరువు చేయవచ్చును.

9. సోదాలకు మరియు అభిగ్రహణలకు సంబంధించి క్రిమినలు ప్రక్రియా స్మృతి, 1973లో గల నిబంధనలు, వీలైనంత వరకు, ఈ చట్టం క్రింద చేయు ప్రతి సోదాకు లేక అభిగ్రహణకు వర్తించును.

సోదాలు, అభిగ్రహణలు క్రిమినలు ప్రక్రియా స్మృతి, 1973 ప్రకారం చేయవలసియుండుట. 1974 లోని 2.

10. 3వ పరిచ్ఛేదం క్రింద చేసిన ఉత్తరువును ఉల్లంఘించుచు ఏదేని వస్తువును లేక ఏదేని కోవకుచెందిన వస్తువులను ఉత్పత్తిచేయు వారెవరైనను,-

3వ పరిచ్ఛేదం క్రింద చేసిన ఉత్తరువులను ఉల్లంఘించినందులకు శాస్తి.

(ఎ) ఆరుమాసాల దాక ఉండగల కాలావధికి కారావాసంతోను, లేక సదరు వస్తువును లేక సదరు కోవకుచెందిన వస్తువులను ఉత్పత్తిచేసిన ఒక్కొక్క మగ్గానికి అయిదువేల రూపాయల దాకా ఉండగల జుర్మానాతోను లేక ఈ రెండింటితోను మరియు ఉల్లంఘన కొనసాగుచుండుచో, మొదటి అట్టి ఉల్లంఘన కొరకు దోష స్థాపన జరిగిన తరువాత అట్టి ఉల్లంఘన కొనసాగుచుండు కాలావధిలో ప్రతి దినమునకు ఒక్కొక్క మగ్గానికి అయిదువేల రూపాయలదాకా ఉండగల అదనపు జుర్మానాతోను శిక్షింపబడదగియుండురు; మరియు

(బి) ఏ వస్తువు లేక ఏ కోవకుచెందిన వస్తువు విషయంలో ఉత్తరువు ఉల్లంఘింపబడినదో ఆ వస్తువును లేక ఆ కోవకుచెందిన వస్తువులను లేక ఏ మరమగ్గాన్ని ఉపయోగించి అట్టి ఉత్తరువును ఉల్లంఘించడం జరిగిందో ఆ మరమగ్గాన్ని, ఆ వస్తువు లేక ఆ కోవకుచెందిన వస్తువులు ఉన్నట్టి ప్యాకేజీ, కవరు లేక పాత్రతోసహా కేంద్ర ప్రభుత్వానికి చెందునట్లు సమపహరణ చేయవలెను:

అయితే, ఏవేని వస్తువులు, మరమగ్గం లేక ఏదేని ప్యాకేజీ, కవరు లేక పాత్రకు సంబంధించి సమపహరణ ఆదేశమునిచ్చుట అవసరంలేదని న్యాయస్థానము అభిప్రాయపడినచో, కారణాలను వ్రాసియుంచి, అట్లు ఆదేశించుటను మానుకొనవచ్చును.

11. ఎవరేని వ్యక్తి,-

అబద్ధంచెప్పుట.

(ఎ) 6వ పరిచ్ఛేదం క్రింద చేసిన ఏదేని ఉత్తరువు ద్వారా ఏదేని సమాచారమును లేక నమూనాను అందజేయవలసిందిగా కోరబడినప్పుడు, ఏదేని ముఖ్య వివరమునకు సంబంధించి అబద్ధమైనట్టి లేక అబద్ధమైనదని తనకు తెలిసియున్నట్టి అట్టిదని తాను విశ్వసించుటకు యుక్తమైన కారణము గలిగియున్నట్టి నిజమైనదని తాను విశ్వసించనట్టి దానిని దేనినైనను చెప్పినచో లేక అట్టి ఏదేని సమాచారమును అందజేసినచో లేక అట్టి నమూనాను అందజేయనిచో లేక దేనినుండి అట్టి నమూనా కోరబడినదో అట్టి ఏదేని వస్తువును నష్టపరచుచో, లేక నాశము చేయుచో; లేక

(బి) ఏవేని లెక్క పుస్తకాలను, రిజిస్టర్లను, రికార్డులను, లేక ఇతర దస్తావేజులను పంపవలెనని 7వ పరిచ్ఛేదం క్రింద ప్రాధికృతాధికారి కోరినప్పుడు, దాఖలు చేయకపోయినచో లేక అట్టి పుస్తకాలను, రిజిస్టర్లను లేక ఇతర దస్తావేజులను నష్టపరచినచో లేక నాశనము చేసినచో,

అతడు మూడు మాసాలదాక ఉండగల కాలావధికి కారావాసంతోను లేక అయిదువేల రూపాయలదాకా ఉండగల జుర్మానాతోను లేక ఈ రెండింటితోను శిక్షింపబడదగియుండును.

ప్రయత్నాలు మరియు దుష్ప్రేరణ.

12. 3వ పరిచ్ఛేదం క్రింద చేసిన ఏదేని ఉత్తరువును ఎవరేని వ్యక్తి ఉల్లంఘించుటకు ప్రయత్నించు లేక అట్టి ఉల్లంఘనకు దుష్ప్రేరణచేయు ఏ వ్యక్తియైనను, ఆ ఉత్తరువును ఉల్లంఘించినట్లు భావించవలెను.

కంపెనీలచే అపరాధములు.

13. (1) ఈ చట్టం క్రింది అపరాధమును ఒక కంపెనీ చేసినయెడల, ఆ అపరాధం జరిగినపుడు ఆ కంపెనీ వ్యాపార నిర్వహణ భారాన్నివహించిన లేక దానికై కంపెనీకి ఉత్తరదాయియైయుండిన ప్రతి వ్యక్తియును, ఆ కంపెనీయు ఆ అపరాధం చేసినట్లు భావించవలెను; మరియు చర్యలు జరుపబడి తదనుసారంగా శిక్షింప బడుటకు లోనుకావలెను:

అయితే, అట్టి ఎవరేని వ్యక్తి తనకు తెలియకుండ ఆ అపరాధము జరిగినదని మరియు అట్టి అపరాధ నివారణకై తగు జాగ్రత్త అంతయు తీసుకొనినట్లు రుజువుచేసినచో, ఈ ఉపపరిచ్ఛేదంలో నున్నదేదియు అతనిని ఈ చట్టంలో నిబంధించబడిన ఎట్టి శిక్షకును పాత్రుని చేయదు.

(2) ఉపపరిచ్ఛేదం (1)లో ఏమి యున్నప్పటికిని, ఈ చట్టం క్రింద అపరాధమును ఒక కంపెనీ చేసియుండి మరియు ఆ అపరాధం ఆ కంపెనీ యొక్క ఎవరేని డైరెక్టరు, మేనేజరు, కార్యదర్శి లేక ఇతర అధికారి సమ్మతితో లేక మౌనానుకూలతతో జరిగినదని లేక వారి నిర్లక్ష్యం వలన ఆ అపరాధం జరిగినదని రుజువైనయెడల, అట్టి డైరెక్టరు, మేనేజరు, కార్యదర్శి లేక ఇతర అధికారి కూడ ఆ అపరాధం చేసినట్లు భావించవలెను మరియు చర్యలు జరుపబడి తదనుసారంగ శిక్షింపబడుటకు పాత్రుడగును.

<u>విశదీకరణ</u>:- ఈ పరిచ్ఛేదం నిమిత్తం:-

(ఎ) "కంపెనీ" అనగా ఏదేని నిగమనికాయము అని అర్థము. ఈ పదపరిధియందు తత్సమయమున అమలులోనున్న ఏదేని శాసనము క్రింద రిజిస్టరైన లేదా రిజిస్టరైనట్లు భావించబడిన సహకార సంస్థ, ఫర్మ లేక వ్యక్తుల ఇతర అసోసియేషను చేరియుండును; మరియు

(బి) ఫర్మకు సంబంధించి "డైరెక్టరు" అనగా ఆ ఫర్మలోని భాగస్వామి అని అర్థము.

అపరాధములు సంజ్ఞేయము లైయుండుట. 1974 లోని 2.

14. క్రిమినలు ప్రక్రియా స్మృతి, 1973లో ఏమి యున్నప్పటికిని, ఈ చట్టం క్రింద శిక్షింపదగు ప్రతి అపరాధము సంజ్ఞేయమైయుండును.

ప్రత్యాయోజనము చేయు అధికారము.

15. కేంద్ర ప్రభుత్వం ఉత్తరువు ద్వారా, 3వ పరిచ్ఛేదం క్రింద లేదా 18వ పరిచ్ఛేదం క్రింద ఉత్తరువులు చేయు లేదా 19వ పరిచ్ఛేదం క్రింద నియమాలు చేయు అధికారమును తప్ప ఈ చట్టపు నిబంధనల క్రింద తాము వినియోగించదగు అధికారాలను ఆదేశములో నిర్దిష్టపరచునట్టి ఏవేని అట్టి విషయాలకు సంబంధించి మరియు అట్టి షరతులు ఏవేని ఉన్నచో వాటికి లోబడి,

(ఎ) కేంద్ర ప్రభుత్వమునకు అధీనస్థుడైన, ఆదేశములో నిర్దిష్టపరచునట్టి అధికారి గాని ప్రాధికారి గాని లేక

(బి) ఆదేశములో నిర్దిష్టపరచునట్టి రాజ్యప్రభుత్వం లేదా ఏదేని రాజ్య ప్రభుత్వమునకు అధీనస్థుడైన అధికారిగాని, ప్రాధికారిగాని కూడ వినియోగించదగి యుండునని ఆదేశించవచ్చును.

ఆదేశముల నిచ్చుటకు కేంద్ర ప్రభుత్వ అధికారము.

16. ఈ చట్టపు నిబంధనలను అమలుపరచుటను గూర్చి కేంద్ర ప్రభుత్వం తాము ఆవశ్యకమని తలచునట్టి ఆదేశాలను ఏదేని రాజ్య ప్రభుత్వమునకు ఈయ వచ్చును.

సద్భావ పూర్వకంగా తీసుకొనబడిన చర్యకు రక్షణ.

17. ఈ చట్టము క్రింద లేదా 3వ పరిచ్ఛేదం క్రింద చేసిన ఉత్తరువు క్రింద సద్భావపూర్వకముగా చేయబడిన లేక చేయుటకు ఉద్దేశింపబడిన దేనికైనను కేంద్ర ప్రభుత్వంపై గాని, రాజ్యప్రభుత్వంపై గాని లేక కేంద్ర ప్రభుత్వం లేక రాజ్య ప్రభుత్వం యొక్క ఎవరేని అధికారిపై లేదా ఉద్యోగిపై గాని లేక ఎవరేని ప్రాధికృతాధికారిపై గాని దావా, అభియోగము లేక ఇతర శాసనబద్ధ చర్య ఏదియు ఉండదు.

మినహాయించుటకు అధికారము.

18. (1) 3వ పరిచ్ఛేదం క్రింద ఉత్తరువు ద్వారా ప్రత్యేకించబడిన ఏదేని వస్తువుకు లేదా ఏదేని కోవకుచెందిన వస్తువులకు భారతదేశం బయట ఉన్నట్టి గిరాకీని తీర్చుటకు చేనేత పరిశ్రమకు సాధ్యముకాదని లేక ఏదేని అట్టి వస్తువు లేక అట్టి కోవకుచెందిన వస్తువులు పరిశోధనా ప్రయోజనాల కొరకు లేక అట్టి వస్తువుకు లేక అట్టి కోవకుచెందిన వస్తువులకు మార్కెట్లను లేక సాధారణంగా చేనేత పరిశ్రమను అభివృద్ధిచేయుట కొరకు, మినహాయించుట ఆవశ్యకమని లేక ఉపయుక్తమని కేంద్ర ప్రభుత్వం తృప్తిచెందినచో, ఆ ప్రభుత్వం రాజపత్రంలో ప్రచురించిన ఉత్తరువు ద్వారా అట్టి వస్తువును లేక అట్టి కోవకుచెందిన వస్తువులను అట్టి ఉత్తరువు నుండి మినహాయించి కేవలం ఎగుమతి ప్రయోజనాల కొరకు లేక పరిశోధన కొరకు ఏదేని మరమగ్గం ద్వారా అట్టి వస్తువును లేక అట్టి కోవకుచెందిన వస్తువులను ఉత్పత్తి చేయుటకు ఆ ఉత్తరువులో నిర్దిష్టపరచునట్టి సంస్థలను అనుమతించవచ్చును.

(2) ఈ పరిచ్ఛేదం క్రింద చేసిన ప్రతి ఉత్తరువు దానిని చేసిన పిమ్మట వీలయినంత శీఘ్రంగ, పార్లమెంటు అధివేశనంలోనున్న సమయమున, మొత్తం ముప్పది దినముల కాలావధిపాటు దాని ప్రతియొక సదనం సమక్షమున ఉంచవలెను. ఆ ముప్పది దినములు, ఒకే అధివేశనములోగాని వరుసగా వచ్చు రెండు లేక అంతకు ఎక్కువ అధివేశనములలో గాని చేరియుండవచ్చును. పైన చెప్పిన అధివేశనమునకు లేక వరుసగా వచ్చు అధివేశనములకు వెనువెంటనే వచ్చు అధివేశనం ముగియుటకు పూర్వమే ఆ ఉత్తరువులో ఏదేని మార్పు చేయుటకు ఉభయ సదనములు అంగీకరించినచో లేక ఆ ఉత్తరువు చేయబడరాదని ఉభయ సదనములు అంగీకరించినచో, అటు పిమ్మట, ఆ ఉత్తరువు అట్లు మార్పుచేసిన రూపంలో మాత్రమే ప్రభావం కలిగియుండును, లేక సందర్భానుసారంగా, ప్రభావరహితమైయుండును; అయి నప్పటికిని ఏదేని అట్టి మార్పుగాని, రద్దుగాని అంతకుపూర్వం ఆ ఉత్తరువు క్రింద చేసిన దేని శాసనమాన్యతకైనను భంగము కలిగించదు.

నియమాలు చేయు అధికారము.

19. (1) కేంద్ర ప్రభుత్వం ఈ చట్ట ప్రయోజనాలను నెరవేర్చుటకు రాజపత్రంలో అధిసూచన ద్వారా నియమాలను చేయవచ్చును.

(2) ఈ చట్టం క్రింద చేసిన ప్రతి నియమమును దానిని చేసిన పిమ్మట వీలయినంత శీఘ్రంగ, పార్లమెంటు అధివేశనంలోనున్న సమయమున, మొత్తం ముప్పది దినముల కాలావధిపాటు దాని ప్రతియొక సదనం సమక్షమున ఉంచవలెను. ఆ ముప్పది దినములు, ఒకే అధివేశనంలో గాని వరుసగావచ్చు రెండు లేక అంతకు ఎక్కువ అధివేశనములలోగాని చేరియుండవచ్చును. పైన చెప్పిన అధివేశనమునకు లేక వరుసగావచ్చు అధివేశనమునకు వెనువెంటనే వచ్చు అధివేశనము ముగియుటకు పూర్వమే ఆ నియమములో ఏదేని మార్పు చేయుటకు ఉభయ సదనములు అంగీకరించినచో లేక ఆ నియమమును చేయురాదని ఉభయ సదనములు అంగీకరించినచో, అటు పిమ్మట, ఆ నియమము అట్లు మార్చిచేసిన రూపంలో మాత్రమే ప్రభావం కలిగియుండును, లేక సందర్భానుసారంగా, ప్రభావరహితమ్మైయుండును; అయినప్పటికిని, ఏదేని అట్టి మార్పుగాని, రద్దుగాని అంతకు పూర్వము ఆ నియమం క్రింద చేసిన దేని శాసనమాన్యతకైనను భంగం కలిగించదు.